టైం... బాగోలేదు



కార్పొరేషన్ వద్దనున్న క్లాక్



వన్‌టౌన్ కూడలిలోని టవర్ క్లాక్

అనుకున్న కార్యం జరగనప్పుడు నా టైం బాగోలేదు...అంటుంటాం. కడప నగరంలో వన్‌టౌన్ కూడలిలో ఉన్న రహమతుల్లా టవర్ క్లాక్, కార్పొరేషన్ వద్ద ఏర్పాటు చేసిన క్లాక్‌కు కూడా టైం బాగోలేనట్లుంది. గతంలో గంట మోగించి మరీ సమయాన్ని తెలియజేసే క్లాక్‌లలో చక్రాలు ఆగిపోవడంతో ముల్లులు ముందుకు కదలడం లేదు. గతంలో మున్సిపల్ అధికారులు కొన్నాళ్లు వీటిని పనిచేసేలా చేసినప్పటికీ సక్రమంగా నిర్వహణ లేకపోవడంతో వాటి కాలం ఆగిపోయింది. వాటిని పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు. – ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్

వేడిని తట్టుకుని.. విరబూసిన బంతి



కడప నగరం సమీపంలోని సికె.దిన్నె వద్ద రైతులు బంతి పూల సాగు చేశారు. వేసవిలో ఎండ వేడిమిని తట్టుకుని బంతి విరగగాసింది. తమిళనాడు, బెంగళూరులో ఈ పూలకు మంచి డిమాండ్ ఉంది. భూగర్భ జలాలు తగ్గిపోతున్న నేపథ్యంలో ఇలా పూల తోటలు పెంచుకని రైతు కొంత మేర గట్టెక్కుతున్నారు.

–మహమ్మద్ రఫీ, సాక్షి ఫొటో గ్రాఫర్

క్లుప్తంగా

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజనల్ ప్రెసిడెంట్ నాగముని, డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు కోరారు. కడప డిపో వద్ద ఎర్రబ్యాడ్జీలు ధరించి శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప రీజియన్ వ్యాప్తంగా అపరిష్కృత ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని విన్నవించినా ఫలితం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ జయరాం, వైస్ ప్రెసిడెంట్ పీఎస్.ఖాన్, సంయుక్త కార్యదర్శులు మూర్తి, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణ



కార్యక్రమంలో న్యాయమూర్తులు, తదితరులు

కడప అర్బన్: కడప జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు ఇస్తున్న 40 గంటల శిక్షణ శుక్రవారం ముగిసింది. రోల్ ప్లే- సెవెన్ మోహన్ వర్సెస్ సాఫ్ట్ డ్రింక్, న్యాయపరమైన మధ్యవర్తులకు నైతికసూత్రాలు, డాక్యుమెంటరీ, ఇంటరాక్టివ్ సెషన్ అంశాలపై వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి, సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు ఐదు రోజులుగా పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమాలో వారితోపాటు పీజీ.సురేష్, జి.జ్యోతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శికి సత్కారం



త్యాగరాజును సన్మానిస్తున్న నాయకులు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మాజీ కార్పొరేటర్ త్యాగరాజును సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయనకు శాలువా కప్పి పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాషువా, నాగరాజు, కంచుపాటిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడి సర్వేలతో నష్టం

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో మొక్కుబడి సర్వేలతో రైతులు తీవ్రంగా నష్టపోతారని సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా భూ సర్వే నిర్వహిస్తున్నారని, 50 శాతం పారదర్శకంగా చేపట్టి, మిగిలిన 50 శాతం భూముల సర్వే మొక్కుబడిగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. రీ సర్వే అనేది మొదటగా గ్రౌండ్ ట్రూత్ నిర్వహిస్తారని, తర్వాత రెండోసారి గ్రౌండ్ వాల్యుయేషన్, మూడోసారి స్టోన్స్ పొలాల గేట్లకు వేయించడం జరగాలన్నారు. సర్వేను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం దుర్మార్గమన్నారు.

లీకేజీ ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి గణిత పరీక్ష ప్రశ్నా పత్రం లీకేజీలపై చీఫ్, డిపార్టుమెంట్ అధికారితోపాటు ఇన్విజిలేటర్‌గా వ్యవహరిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులను మాత్రమే సస్పెండ్ చేయడం తగదని, ప్రైవేట్ కరస్పాండెంట్‌ను అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. కడప నగరంలోని పీడీఎస్‌యూ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. లీకేజీల్లో కమలాపురంలోని ఓ ప్రవేటు పాఠశాలకు చెందిన కరస్పాండెంట్ హస్తం ఉన్నట్లు పోలీసులు చెప్పారన్నారు. వేంపల్లికు చెందిన కొన్ని ప్రైవేటు పాఠశాలలకు చెందిన వారు సూత్రధారులుగా ఉన్నప్పటికీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ పన్ను వసూలు కేంద్రాలు

కడప కార్పొరేషన్ : ఉగాది, రంజాన్ పండగ సెలవు రోజుల్లోనూ ఆస్తి, నీటిపన్ను వసూలు కేంద్రాలు పనిచేస్తాయని నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కడప నగరపాలక సంస్థ కార్యాలయం, అన్ని వార్డు సచివాలయాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఇంటి, నీటి పన్ను చెల్లించవచ్చని ఆయన తెలిపారు.

పంటలకు గిట్టుబాటు కల్పించడంలో విఫలం

రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు చంద్ర



ఆందోళన నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్/కడప వైఎస్సార్‌సర్కిల్: దేశానికి అన్నం పెట్టే రైతన్న పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు గాలి చంద్ర డిమాండ్ చేశారు. భారతీయ కిసాన్ సంఘ్ పిలుపు మేరకు కడప ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దుల్లో 365 రోజుల ఆందోళన నేపథ్యంలో మూడు చట్టాలు వెనక్కి తీసుకుంటామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం హామీ అమలుపరచడంలో నిర్లక్ష్యం చూపుతోందన్నారు. పెట్టుబడులు రాక, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. 60 ఏళ్లు నిండిన ప్రతి రైతుకు రూ.10వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఏఓకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ.సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు కట్టా యానాదయ్య, ఇ.బాలచంద్రయ్య, చిలుంగారి పెద్ద పుల్లయ్య, శంకర్‌రెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణమే ఆపాలి



నిరసన చేపడుతున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణమే ఆపాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ చేశారు. నగరంలోని మహవీర్ సర్కిల్ సమీపంలో విద్యుత్ భవన్ వద్ద శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ పాదయాత్రలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని లోకేష్ ఇచ్చిన పిలుపును మరిచిపోయారా అని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలపై రెండు సార్లు రూ.15,454 కోట్ల విద్యుత్ ఛార్జీల భారం మోపిందని పేర్కొన్నారు. సెకి ఒప్పందాన్ని రద్దు చేయడానికి అవసరమైన క్లాజు ఉందని నిపుణులు చెబుతున్నా దాన్ని పరిగణలోకి తీసుకోకపోవడం సరైంది కాదన్నారు. అనంతరం విద్యుత్తు భవన్‌లో టెక్నికల్ డీఈకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, అన్వేష్, దస్తగిరి రెడ్డి, చంద్రారెడ్డి, జమీల, కుమారస్వామిరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయభేరి

డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి

కడప కార్పొరేషన్: స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయభేరి మోగించిందని నగర పాలక డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ఎదిరించి ప్రతి కార్యకర్త సైనికుడిగా మారి టీడీపీ దౌర్జన్యాలు, దమనకాండను తట్టుకున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 చోట్ల ఎన్నికలు జరగ్గా 39 చోట్ల వైఎస్సార్‌సీపీ జయకేతనం ఎగురవేసిందన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని అధికార బలాన్ని ప్రదర్శించినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేకపోయారన్నారు. ఇప్పటికైనా కూటమి నేతలు బుద్ధి తెచ్చుకుని, తమ అధికారాన్ని ప్రజల సంక్షేమానికి వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మునిశేఖర్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భగవద్గీతతో ఆధ్యాత్మిక మార్గదర్శనం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మూలమల్లికార్జునరెడ్డి

కడప కల్చరల్: భగవద్గీత మానవుడికి ఆధ్యాత్మిక మార్గదర్శనం చేసే గ్రంథమని ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. కడప నగర సమీపంలోని రామకృష్ణ వానప్రస్తాశమంలో నేహా మ్యూజిక్ ఆధ్వర్యంలో కె.బాబుస్వామి నిర్మించిన గీత పట్టు–రాత మార్పు లఘు చిత్ర పోస్టర్లను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ చిత్రాన్ని భగవద్గీత ఆధారంగా నిర్మించారన్నారు. నిర్మాత బాబూస్వామి మాట్లాడుతూ స్థానికులు అధిక సంఖ్యలో నటించారన్నారు. అతిథి వెంకటసుబ్బారెడ్డి ప్రసంగిస్తూ పుష్పానికి సువాసన ఎంత ముఖ్యమో వృద్ధాప్యంలో ఆధ్యాత్మిక జీవితం ఎంతో ముఖ్యమన్నారు. ఎంసీ.నాగిరెడ్డి, శివరామిరెడ్డి మాట్లాడుతూ ఆశ్రమంలో ఇంత మంచి చిత్రాన్ని చిత్రీకరించడం, ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో స్వరూపారాణి, వెల్లాల వెంకటేశ్వర ఆచారి, సుబ్బిరెడ్డి, నాగరాజు, సిద్దేశ్వర్, కొండారెడ్డి, పూజారి గంగిరెడ్డి, కృష్ణమూర్తి, భారవి,చిట్టెమ్మ పాల్గొన్నారు.

నేడు ఉరుసు

కడప కల్చరల్: కడప నగరం షామీపేటలోని బగ్‌దాదియా పీఠంలో శనివారం రాత్రి హజరత్ సయ్యద్‌షా మహమ్మద్ యూసుఫ్ బగ్‌దాది సాహెబ్ 9వ ఉరుసు ఉత్సవం నిర్వహించనున్నట్లు బద్‌దాదియా పీఠాధిపతి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాత్రి 10.30 గంటల నుంచి బీదాదియా దర్గాలో ఉలేమాల ఉపన్యాసాలు, ప్రసాదంతః పంపిణీ కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యార్థుల హక్కులు కాపాడండి



వీసీకి మొక్క అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల హక్కులను కాపాడాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు, జిల్లా అధ్యక్షులు శివశంకర్ కోరారు. వైవీయూ వీసీ అల్లం శ్రీనివాస రావును శుక్రవారం వారు కలిసి పూల మొక్క అందజేశారు. వారు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థి అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. మరిన్ని ప్రత్యేకమైన డిపార్టుమెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయిమధు, హరి ప్రసాద్, నాగార్జున, గురు మోహన్, పూర్వ విద్యార్థి గంగా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ ప్రారంభం

చింతకొమ్మదిన్నె : రాష్ట్రంలోని 352 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలలో 2025–2026 విద్యా సంవత్సరానికి 6, 11 తరగతులలో ప్రవేశాలకు, 7, 8, 9, 10, 12 తరగతులలో మిగిలి ఉన్న సీట్లలో ప్రవేశాలకు బాలికల నుండి దరఖాస్తులు కోరుతున్నామని మండల విద్యాశాఖాధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెల 22వ తేదీన మొదలైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఏప్రిల్ 11 వరకు ఉంటుందన్నారు. కేజీబీవీలలో చక్కటి చదువుతో పాటు హాస్టల్ వసతి కూడా ఉంటుందని తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, బడి మానేసిన పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనారిటీలు, ఆర్థికంగా వెనుకబడిన వారు, నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కొండ గంగమ్మ తిరునాల

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం గ్రామ సమీపంలో వెలసిన కొండ గంగమ్మ తిరునాల ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి గణపతి పూజ, ఆకుపూజ, అభిషేకాలకరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. వేర్వేరు ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

మతసామరస్యం, ఆత్మీయతలకు ప్రతీక ఇఫ్తార్

మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



ఇఫ్తార్‌లో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

కడప కోటిరెడ్డిసర్కిల్: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ.అంజద్‌బాషా తెలిపారు. కడపప నగర పరిధిలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు నియమ నిబంధనలతో ఉపవాస దీక్ష పాటిస్తారన్నారు. మనిషి సత్ప్రవర్తనతో నడవడానికి రంజాన్ ఉపవాసాలు ఉపకరిస్తాయన్నారు. మనుషుల్లో ప్రేమ, సోదర భావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ మాసం ప్రత్యేకత అన్నారు. అనంతరం అంజాద్‌బాషా ఇతర ముస్లిం ప్రముఖులతో కలిసి ఫల హారాలు స్వీకరించి ఉపవాస దీక్ష విరమించారు. అనంతరం సాముహిక నమాజ్ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముంతాజ్‌బేగం, వైఎస్సార్ సీపీ నేతలు కరీముల్లా, జమీల్, కార్పొరేటర్ షఫీ, కళాశాల డైరెక్టర్ జయరామిరెడ్డి, ప్రిన్సిపల్ షైలా రేఖ, డిప్యూటీ ప్రిన్సిపల్ రామమనోహర్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉగాది నుంచి తెలుగుకు ప్రాధాన్యం ఇవ్వాలి



మొల్లమాంబ విగ్రహం వద్ద భాషాభిమానులు

కడప కల్చరల్: తెలుగువారి నూతన సంవత్సరం నుంచి రాష్ట్రమంతటా తెలుగు భాషకు ప్రాధాన్యతమిచ్చే కార్యక్రమాలు చేపట్టాలని తెలుగు భాషా వికాస ఉద్యమం అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు కోరారు. స్థానిక కోటిరెడ్డి సర్కిల్‌లో ప్రముఖ అవధాని నరాల రామారెడ్డితో కలిసి మొల్లమాంబ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది ప్రారంభం నుంచి తెలుగు భాషను సంపూర్ణంగా అమలు చేస్తామని ప్రకటించాలనికోరారు. ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని, కార్యాలయాల నామ పలకాలు మాతృ భాషలో ఉండాలని కోరారు. అవధాని నరాల రామారెడ్డి మాట్లాడుతూ దేశ భాషల్లో తెలుగు ఎంతో గొప్పదని, సాక్షాత్తు శ్రీకృష్ణదేవరాయలు కీర్తించారని, ఈ భాషను మనం మరింత గర్వపడేలా వాడేందుకు ప్రయత్నించాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు తెలుగుభాష గొప్పతనం గురించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో పలువురు భాషాభిమానులు పాల్గొన్నారు.

విజన్ డాక్యుమెంట్ రూపొందిద్దాం



మాట్లాడుతున్న వీసీ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్: కార్యాచరణ, ప్రణాళిక, లక్ష్యాలు, విజన్ డాక్యుమెంట్ రూపొందించడంపై దృష్టి పెట్టాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. జాతీయ విద్యా విధానం–2020 ప్రకారం విద్యార్థుల సంపూర్ణ ప్రగతికి ఆయా శాఖల ఆలోచన, భవిష్యత్తు ప్రణాళికపై శుక్రవారం ఆయన వివిధ శాఖలు సందర్శించి సిబ్బందితో సమీక్షించారు. ఆయా శాఖల విభాగాధిపతులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విభాగాల అభివృద్ధి గురించి కులపతికి వివరించారు. ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనలో పూర్వ విద్యార్థుల సహాయం తీసుకోవాలని, పరిశ్రమలు, సంస్థల నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులను పొంది బోధనాభ్యాస వనరులను బలోపేతం చేయాలన్నారు. డిజిటల్ సాంకేతికతను ఉపయోగించేందుకు అధ్యాపకులను ప్రోత్సహించాలని, వినూత్న పరిశోధన సంస్కృతిని ప్రోత్సహించాలన్నారు. విద్యాలయం నుంచి బయటికి వెళ్లిన విద్యార్థులు స్థానిక , గ్లోబల్ సమస్యలను పరిష్కరించేలా తయారుచేయాలన్నారు. ఉపకులపతి వెంట ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి , కులసచివులు ప్రొఫెసర్ పుత్తా పద్మ, ఐక్యూ ఏసీ డైరెక్టర్ డా.సుబ్రహ్మణ్యంశర్మ పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా రాఘవరెడ్డి



నూతనంగా ఎన్నికైన న్యాయవాదులు

కడప అర్బన్: కడప న్యాయవాదుల సంఘం ఎన్నికలు శుక్రవారం జరిగాయి. ఈ ఎన్నికలలో కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా జీవీ.రాఘవరెడ్డి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా చంద్రవదన, ఉపాధ్యక్షురాలిగా ఉమాదేవి, ట్రెజరర్‌గా సురేష్‌కుమార్ ఎన్నికయ్యారు. సంఘం క్రీడలు, సాంస్కృతికం, మహిళ ప్రతినిధులుగా నాగభూషణం, రంగబాలాజీ, చిన్నయ్య, సుధారాణిలు ఎన్నికయ్యారు. గెలుపొందిన వారికి ఎన్నికల అధికారి జయరామిరెడ్డి పత్రం అందజేశారు.

మెయిన్స్ పరీక్ష తేదీలు ప్రకటించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం కోర్టు కేసులు క్లియర్ చేసి కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష తేదీలను వెంటనే ప్రకటించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. నగరంలోని టీచర్స్ అకాడమీ కోచింగ్ సెంటర్‌లో కానిస్టేబుల్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 2022 నవంబర్, 28న 6100 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. జనవరిలో జరిగిన ప్రిలిమ్స్ పరీక్షకు 4.52 లక్షల మంది అభ్యర్థులు హాజరవగా, 92వేల మంది అర్హత సాధించారని, రెండేళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించారన్నారు. ఇప్పుడు కోర్టు కేసులు క్లియర్‌చేసి మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్నా నిరుద్యోగులకు ఒరిగిందేమీలేదని ఆరోపించారు. పోలీస్ శాఖలో 20 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. నిరుద్యోగులు కోచింగ్ ఫీజులు, రూమ్ అద్దె కట్టలేక, పుస్తకాలు కోనలేక ఇంటిని కుటుంబాన్ని వదిలేసి చదువుకొంటుంటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడం సిగ్గు చేటు అన్నారు. అధికారులు స్పందించి కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు విజయ్, శ్రీకాంత్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతి వెనుక మిస్టరీని ఛేదించండి

కడప వైఎస్ఆర్ సర్కిల్: పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ మృతి వెనుక మిస్టరీని చేధించాలని దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మడగలం ప్రసాద్ డిమాండ్ చేశారు. నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పాస్టర్ పగడాల మృతిపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దర్యాప్తు వేసి నిజానిజాలు నిగ్గు తేల్చినప్పుడే ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. ప్రభుత్వాలు మారినా దాడులు, హత్యలు తగ్గడం లేదని, రాష్ట్రంలో శాంతి భద్రతలను మరింత పెంచాలని కోరారు. దాడులకు, హత్యలకు పాల్పడేవారిని రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తారనే భయం కలిగించాలన్నారు. అప్పుడు మాత్రమే రాష్ట్రంలో మహిళలు, దళితులు, క్రైస్తవులు, ముస్లింలకు రక్షణ చేకూరుతుందన్నారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ మృతి వెనుక ఏదో మిస్టరీ దాగి ఉందని, ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాల చెన్నయ్య, గిరిజన పోరాట హక్కుల సమితి నాయకులు పాల్గొన్నారు.

60 శాతం హామీలు పరిష్కరించాం

కమలాపురం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల్లో 60 శాతం అర్జీలను సంతృప్తికరంగా పరిష్కరించామని కడప ఆర్‌డీఓ జాన్ ఎర్విన్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పంచాయతీల వారీగా రివ్యూ నిర్వహించారు. ఏ పంచాయతీల్లో ఎన్ని అర్జీలు వచ్చాయి? ఎన్ని పరిష్కారం అయ్యాయి? పెండింగ్‌లో ఉన్నవి ఎన్ని? పరిష్కారం కాకపోవడానికి కారణాలేంటి? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప రెవెన్యూ డివిజన్ పరిధిలో జరిగిని రెవెన్యూ సదస్సుల్లో 4423 అర్జీలు వచ్చాయని, అందులో 60 శాతం అర్జీలను తహసీల్దార్లు, క్షేత్ర స్థాయి సిబ్బందితో కలసి సంతృప్తి కరంగా పరిష్కరించామన్నారు. మిగిలినవి కోర్టు సమస్యలు, కుటుంబ తగాదాలున్నవి మాత్రమేనన్నారు. అయితే కోర్టు సమస్యలున్న వారిని కూడా పిలిపించి మాట్లాడామని, రాజీ ధోరణిలో వచ్చి సమస్యలు పరిష్కరించు కోవాలని సూచించామన్నారు. కుటుంబ వివాదాలు ఉన్న సమస్యలను సైతం ఇరువర్గాలు రాజీకి వచ్చి పరిష్కరించుకోవాలని సూచించామన్నారు. వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా కమలాపురం ఏరియా మిగులు, ఇనాం భూములకు సంబంధించి 500 వరకు అర్జీలు వచ్చాయని, జేసీ సూచనల మేరకు దాదాపుగా ఎక్కువ శాతం అర్జీలు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరామిరెడ్డి, వీఆర్ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.